

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 సెప్టెంబరు, 2010 సంచిక : 4

(వికృతి నామ సం॥, భాద్రపద మాసం)

**గౌరవ సంపాదకత్వం**

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

**ప్రధాన సంపాదకత్వం**

శ్రీ మాతా శుకవాణి

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

శ్రీ వి.వి. కృష్ణారావుగారు

(సాయిశ్రీ ప్రింటర్స్)

**ప్రచార సారథ్యం**

శ్రీ ఎం. సత్యనారాయణగారు M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | ......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా | ......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | ......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 08685-326053**
**9440413455, 9848133565**

**విషయసూచిక** **పుటసంఖ్య**

మా వాణి ........ 2
ఖండాంతరాలలో శ్రీసాయితేజం .. 4
ప్రశ్నోత్తర పీఠిక ........ 6
నీ భావనెంతో-ఫలితమంత ........ 8
అక్షతాశీస్సులు ........ 10
వీధి దేవతలు ........ 11
కంఠస్థయోగ్య పద్యాలు ........ 15
సర్వం సాయిమయం ........ 16
ఇంద్రద్యుమ్నుని కథ ........ 17
ఆదిగురువు-దత్త ప్రభువు ........ 19
ఆంధ్రరత్న-రామదండు ........ 23
మాతృసంస్థ కబుర్లు ........ 26
ఇల్లా రారండీ! ........ 32







# మా వాణి



సాయి బంధువులందరికీ నమస్సుమాంజలి.

ఈవేళ సాయిదేవులకు విన్నపాలు చేసుకోవడానికే యీ కలం కదలిక. రెండునెలలు - ఈ మధ్యనే నాలుగు క్రమాల నుంచీ ఇద్దరు స్వామీజీలు, ఇద్దరు నిర్వహణాధికారులు మన ఆశ్రమ సందర్శనానికి వచ్చారు. వారివారి తావులలో వారు ఎదుర్కొనే యిబ్బందులు, విధర్మీయుల వలన యిక్కట్లు, ఆధిపత్యం కోసం కొట్లాటలు మొదలైన వాటిని గూర్చిన చర్చ వచ్చింది. దానిలో విన్నవన్నీ మా అనుభవాలతో కలుపుకొంటే చిత్రంగా తోచింది. తుఫానులు కల్పించేదీ ఆయనే, అవి ఆపి రక్షించేదీ ఆయనే. అయినా యీ లోపల ప్రకృతి అతలాకుతలం కాక తప్పదు గదా! సేవారంగం ముళ్లపానుపేననీ, యిది నిరంతర సమస్యా తోరణాన్ని తగిలించుకోవటానికి సంసిద్ధమైన ముంగిలి లాంటిదేననీ తెలిసే దిగినా -మానవ నైజాన్ని దాటి వెళ్లలేని అశక్తత వలన ఎక్కడో మనస్సు చివుక్కుమనక మానదు.

'మేమున్నాం' అని తోడు నిలిచే కార్యకర్తల సంఖ్య చాలినంతగా లేకపోవటం-రోజురోజుకీ కొఱవడిపోతున్న పని వాళ్ల సంఖ్య- క్షణక్షణంగా పెరిగిపోతున్న ధరలు-బరువవుతున్న నిర్మాణాలు, నిర్వహణలు - దొరకని యోగ్యులైన పూజారులు-అనుకొన్న రీతిలో నడవని శిష్యులు-చెయ్యాలనుకున్నంతగా చెయ్యలేక యింకా మిగిలిపోతున్న సేవా కార్యక్రమాలు-యివన్నీ మామూలు సమస్యలు. అయితే వీటన్నిటికీ పరిష్కారంగా ఆర్థిక పరిపుష్టి ఏర్పడితే సరిచేసుకోవచ్చు. కానీ -

బల్లెంలా గుచ్చుకొనేది విశ్వాసరాహిత్యం. 'ఆశ్రమం నాకేమి చేసింది? అని

కాక, ఆశ్రమానికి నేనేం చేసాను?' అని ఆలోచించలేని స్వార్థం - 'ఆకాశానికి ఉమ్మివేస్తే మన ముఖానే పడుతుంద'ని గ్రహించలేని మూర్ఖత్వం - ఏ దిక్కూలేని వాళ్లమని వచ్చి, ఆషాఢభూతుల్లాగా ఉండి, చివరికి తమ బలహీనతలు బయటపడగానే తరలిపోయే జీవుల ధూర్తత - క్షణక్షణం తమ కష్టాలు చెప్పకొని, వీలైనంత రాబట్టుకొనే సోమరుల వంచనాశిల్పం - అవసరం తీరేవరకూ, ఒడ్డు చేరే వరకూ ఓడ మల్లయ్య, చేరాక బోడి మల్లయ్య' అనే ధోరణులు - కపటంతో ఆశ్రమాలను వాడుకొని తమ పరపతి పెంచుకోవాలనుకొనే వంచన - 'నిన్న మనం చూపిన ప్రేమకూ, యివ్వేళ కక్కే విషానికీ పొంతన ఉన్నదా?' అని ఆలోచించే పాటి వివేకం లేని అహంకారాలు - యివన్నీ కలిసి సేవకులను, వారి ఏక దీక్షను ఛిన్నాభిన్నం చేసే ప్రయత్నం చేస్తుంటాయి. అప్పడప్పడూ దానివలన కొద్దికాలం పని చేసే వారి మానసిక శక్తులు కుంటుపడతాయి. అయినాగానీ పరమాత్ముని రక్షాహస్తం కాపాడుతుందన్నది నిర్వివాదం. "నీమీద లోకం దుమ్మెత్తి పోస్తోందా? అయితే నీవు నిర్వీర్యంగా ఉండక పనిచేస్తున్నావనే అర్థం" అన్నారు స్వామీ వివేకానంద. "నావైపెందుకు అంత ద్వేషంగా చూస్తున్నావు? నేనెప్పడూ నీకు మేలు చేసిన గుర్తు లేదే!" అన్నది ఒక ఫ్రెంచ్ సామెత. ఈ విషయాలే గురుదేవులు వివరించి చెప్పి, వారందరికీ సాంత్వన కలిగించారు. అందుచేత -

ప్రియమిత్రులారా, ఆశ్రమాలన్నిటి క్షేమం కోసం - మాతో కలిసి శ్రీసాయినాథుని ప్రార్థించండి - "పృథ్వీతలంలోని కష్టాలన్నీ మాకివ్వు స్వామీ! దానివలన లోకమంతటికీ బాధావిముక్తి కలగనీ. కానీ, నీవు మాపై పెట్టిన బరువు మోసే శక్తిని మాత్రం నీవే ప్రసాదించు తండ్రీ!".







# ఖండాంతరాలలో శ్రీ సాయితేజం

- 'ది హిందూ'లోని వార్త ఆధారంగా

శ్రీ సాయినాథుల వారు తమ అవతారం చాలించినది 1918వ సంవత్సరంలో. మరో ఎనిమిదేళ్లకు సమాధికి నూరేళ్లు వస్తాయి. సాయిబాబా వారు సమాధి చెందాకనే వారి శక్తి తీవ్రంగా వ్యాప్తి చెందిందనిపిస్తూంటుంది. యావద్భారతదేశంలోనూ వేలాదిగా సాయి దేవాలయాలు నిర్మాణం చేసారు భక్తులు. ఒక్క మన ఆంధ్రప్రదేశ్‌లోనే వేలకొద్దీ వెలిసాయి గదా! మన దేశానికే యివి పరిమితం కాలేదు. అంతర్జాతీయంగా యీ మందిర నిర్మాణాలు సాగుతున్నాయి.

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ............ ఎన్నెన్ని దేశాలలోనో యీ దేవాలయాలు నెలకొన్నాయి. ప్రతి గురువారం ఐదారు వందల మంది భక్తులు సాయి దర్శనం చేసుకొని హారతులు పాడుతుంటారు అక్కడ కూడా. ఆలయాలేగాక ప్రార్థనా మందిరాల పేరిట వందకు పైగా కేంద్రాలున్నాయి. చికాగోలోని హ్యామశాయర్ అనేచోట 120 సంవత్సరాలనాటి చర్చ్‌లో ఒక మూల బాబావారి విగ్రహాన్ని పెట్టి, ప్రతిరోజూ నాలుగు హారతులూ యిస్తున్నారు. విదేశాలలో మొట్టమొదటి దేవాలయం అమెరికాలోని న్యూయార్క్‌లో 1982లో నిర్మింపబడింది. గురువారాలు, ఆదివారాలలో (ఆరోరా) దేవాలయంలోకి జనం విరగబడతారు. షిరిడీలోని సాయి సంస్థానంలో నిర్వహింపబడే ఉత్సవాలన్నీ యీ దేవాలయంలో నిర్వహింపబడతాయి. ఇక్కడ ప్రతిష్ఠించబడిన విగ్రహం ముంబయిలోని రాజు తాలిమ్ అనే శిల్పి తయారుచేసాడు. న్యూయార్క్‌లోని ఫ్లోషింగ్, వాల్విన్ అనేచోట్ల కూడా సాయి దేవాలయాలున్నాయి. డా॥ కర్లిన్ మేక్లేన్, మేరీ రాబర్ట్స్ అనే అమెరికన్లు తమ డాక్టరేట్ (పి.హెచ్‌డి) డిగ్రీలకు సాయిబాబా జీవితాన్నీ, బోధలనూ తీసికొని థీసిస్‌లు వ్రాసారు. వాళ్లు దీనికోసం షిరిడీ వచ్చి ఎనిమిది రోజుల పాటు ఉన్నారు. ప్రసాదాలయం, హాస్పిటల్స్, భక్త నివాస్, శ్రీ సాయి మందిరం మొదలైన

చోట్లన్నీ తిరిగి చూచి, బాబా గురించి పరిశోధన చేశారు.

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో పెద్ద సాయి దేవాలయం ఉంది. గుంపులు గుంపులుగా భక్తులు దర్శనం చేసుకొంటుంటారక్కడ. కెనడాలోని టోరెంటో, వేంకోవర్ అనేచోట్ల మంచి ఆలయాలున్నాయి. సింగపూరు, కెన్యా, ఇండోనేషియా, మలేషియా, మారిషస్, న్యూజిలాండ్, టాంజానియా, బ్రిటన్, హాంగ్‌కాంగ్, కువైట్, శ్రీలంక, జాంబియా, జపాన్, సౌదీ అరేబియా, రష్యా, నెదర్లాండ్, స్పెయిన్, ఫిజీ, బెర్ముడా, నార్వే, వెస్టిండీస్ - యింకా ఎన్నో దేశాలలో చక్కని సాయి దేవాలయాలు, మంచి విగ్రహాలతో నెలకొని ఉన్నాయి. వీటిలో ఎక్కువభాగం విగ్రహాలు రాజస్థాన్‌లోని జైపూర్ శిల్పుల చేతులలోనే తయారవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి-చెన్నై రోడ్డు మీద భూతలానికి మూడు, నాలుగు వందల అడుగుల ఎత్తున గల నగరియా అనేచోట పది ఎకరాల స్థలంలో, పది కోట్ల ఖర్చుతో దేశం అంతటిలోనూ పెద్ద సాయి మందిరం నిర్మాణం కాబోతోంది.

షిరిడీ సాయి సంస్థాన్‌లో శ్రీరామనవమి, గురుపూర్ణిమ, శ్రీ సాయి పుణ్యతిథి ఏటా ఘనంగా జరుగుతుంటాయి. దేశం నలుమూలల నుండీ వందలాదిగా సాయి పల్లకీలు, లక్షలాదిగా జనం తరలివస్తుంటారీ ఉత్సవాలకు. శ్రీ సాయి నిర్వాణం చెంది తొంబై ఏళ్ళకు పైగా గడిచాక - వారి శక్తి యిలా జాజ్వల్యమానంగా ప్రకాశించటం చూస్తోంటే వారన్న మాటలే - ఆయన ఏకాదశ వాగ్దానాలలోనివే - గుర్తు వస్తున్నాయి.

"సమాధి నుండియే నేను సర్వ కార్యములు నిర్వహించెదను. నాయందెవరి దృష్టి కలదో వారి యందు నా కటాక్షము కలదు". సాయినాధులు మన గడ్డపైనే పుట్టి, యిక్కడే సమాధి అయినారు. ఇంతటి మహాశక్తి మనకు తోడుగా ఉండగా - విదేశీయులెందరో సాయికోసం పరుగులు తీస్తుండగా - మన మాత్రం ఎవరో వచ్చి మనను సంస్కృతీభ్రష్టులను చేసే ప్రయత్నం చేస్తుంటే తలవంచటం సిగ్గుచేటు గదా!





# ప్రశ్నోత్తర పీఠిక

తూములూరి లక్ష్మీనారాయణ, సూర్యారావుపేట, విజయవాడ

**ప్రశ్న :** ***శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారికి ప్రణామములు. కొంతకాలంగా ఒక ప్రశ్నకు సమాధానం కోరి ఎందరినో అడిగాను. ఎన్నో గ్రంధాలు చదివాను. తేలలేదు. తమరి ముందుంచుతున్నాను. పరమపూజ్యశ్రీ గురుజీ (గోల్వాల్కర్‌జీ) కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర భారతీ స్వామి వారిని - సంఘ కార్యకర్తల కోసం ఏదైనా సరళమైన ఉపాసన చెప్పవలసిందిగా కోరారు. స్వామివారు కొద్దిసేపు ఆలోచించి, ప్రాణాయామాదులు చేసుకొని కొద్దిసేపు భ్రుకుటి మధ్య దత్తాత్రేయ స్వామిని ధ్యానించుకోవలసిందిగా సెలవిచ్చారట. ఇంతమంది దేవతలుండగా దత్తాత్రేయునే ఎందుకు ధ్యానించవల సిందిగా చెప్పారు? కార్యకర్తలు ఆ ధ్యానం వలన ఎలాంటి ప్రయోజనం పొందగలరు - ఇదీ నా ప్రశ్న. తమకు వీలైనరీతిలో అనుగ్రహించగలరు.***

***లక్ష్మీనారాయణగారూ,***

మీ ప్రశ్న చాలా సమంజసమైన ప్రశ్న. పరమమాహేశ్వరులై, నడిచే దైవమని పేరందిన పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర భారతీస్వాముల వారి ఆదేశం శిరోధార్యమే. కారణాలు చూద్దాం. అదీ శ్రీదత్తులిచ్చిన స్ఫూర్తితోనే సుమా!

దత్తాత్రేయులు త్రిమూర్త్యాత్మకులు. సత్వ, రజస్తమో గుణాలు మూడింటినీ తమలో నిలుపుకొంటూనే వాటికి అతీతంగా, నిర్లిప్తంగా ఉండనేర్చినవారు. కార్యకర్త అయినవాడు సమాజ కార్యసాధనకై ఎప్పుడు ఏ గుణాన్ని సంతరించుకోవాలో దేన్ని ప్రదర్శించాలో నేర్చి ఉండాలి. అలా ప్రదర్శిస్తూనే వాటికి అతీతంగా- అంటే లౌకిక కార్యసాధనకై ఆయాగుణాలు చూపించాలే తప్ప అతని ఆంతర్యం వాటికి అతీతంగా ఉంచుకోవాలి.

దత్తాత్రేయుడు సంహారకార్యం ఎన్నడూ చేపట్టలేదు. ఆయనది సంస్కార

కార్యం. కార్యకర్త కూడా తనచుట్టూ ఉన్న వారిలోని అలసత్వాన్నీ, మూఢత్వాన్నీ, బాధ్యతారాహిత్యాన్నీ, దురాచారాలనూ పోగొట్టడానికి ప్రయత్నించాలి తప్ప ఆయా లక్షణాలున్న వ్యక్తులను ద్వేషించటం తగనిపని. ఒకవేళ తప్పని పరిస్థితి వచ్చినా శత్రువులు వాళ్ల వేళ్లతో వాళ్ల కళ్లే పొడుచుకొనేలా చెయ్యటమేగానీ తాను హింస చెయ్యలేదు దత్తుడు. అలాగే కార్యకర్త కూడా సమాజద్రోహులు, దేశద్రోహులను సమాజమే తిప్పికొట్టేలాగా వ్యవస్థ తయారుచేసి దుష్టుల దుష్టత్వమే వాళ్లను నాశనం చేసేలా చెయ్యగలగాలి.

దత్తాత్రేయ స్వామి నిరాడంబరుడు. ఏ విధమైన హంగులూ పొంగులూ లేనివాడు. లౌకిక విషయాలలో నిమగ్నుడైనట్లు కనిపించినప్పటికీ దేనినీ అంటించుకోనివాడు. సమాజ వైభవాల మధ్య తిరుగుతున్నప్పటికీ వాటికి లోబడని స్థిరత్వం కార్యకర్తకు కూడా కావాలి. దత్తాత్రేయుల వారు తమకు ఇరవై నలుగురు గురువులున్నారని చెప్పకున్నారు. ఒక్కొక్కరి నుండీ ఒక్కొక్క పాఠం నేర్చుకున్నానన్నారు. నేర్చుకోదలచుకున్న వాడికి ప్రకృతి అంతా పాఠశాలే. ప్రతి జీవీ గురువే. చీమ నుంచీ శ్రమ శీలత్వాన్నీ, కాకి నుండీ ఐకమత్యాన్ని, తుమ్మెద నుంచీ మూలాన్ని చిదపకుండా లాభం గ్రహించడాన్నీ నేర్చుకోగలం. కార్యకర్త అయినవాడు తన చుట్టూ ఉన్న వారికి తానేదో సహాయం చేసేస్తున్నట్లూ- వాళ్లందరికన్నా తానేదో ఘనుడైనట్లూ భావించరాదు. వారందరి వలననే తనకు సేవాభాగ్యం లభిస్తున్నట్లూ, వాళ్లందరు భగవత్స్వరూపులైనట్లూ భావించగలగాలి. ప్రతివారిలోని విశేషగుణాలను ఆకళింపు చేసుకోగలగాలి. తనలోని లోపాలను సరిచేసుకుంటూ జనహితానికై అంకితం కాగలగాలి. అప్పుడు తానే సమాజానికి మార్గోపదేశం చేయగల గురువుగా మారతాడు.

విశ్వమంతటికీ ఆదిగురువు దత్తాత్రేయుడేనని పెద్దలంటారు. ఆ స్వామి లక్షణాలు కార్యకర్తలకు అనుసరణీయాలు. అందుచేతనే చంద్రశేఖర భారతీస్వాముల వారు దత్తాత్రేయ స్మరణం చేస్తే సరైన కార్యకర్తలగా తయారవుతారని చెప్పి ఉంటారు. సంతృప్తి చెందారా, లక్ష్మీనారాయణగారూ! ఉత్తరం వ్రాయండి.



సాయి వాణి

# నీ భావనెంతో-ఫలితమంత

## -లైఫ్ ఆఫ్ సాయిబాబా (శ్రీ బి.వి. నరసింహ స్వామీజీ) ఆధారంగా

"మంత్రే, తీర్థే, ద్విజే, దేవే, దైవజ్ఞే, భేషజే, గురౌ।
యాదృశీ భావనా యస్య సిద్ధిర్భవతి తాదృశీ ॥

- ఇది అనూచానంగా పెద్దలు చెప్పే విషయం. మంత్రాలు, తీర్థక్షేత్రాలు, బ్రాహ్మణులు (పురోహితులు-పూజారులు), దేవతలు, జ్యోతిష్కులు, మందులు, గురువు - వీరిని సేవించేటపుడు మనలో ఎంత గాఢమైన విశ్వాసం ఉంటే ఫలితం అంత లోతుగా ఉంటుంది. వివేక చూడామణి భక్తి విశ్వాసాల ఆవశ్యకతను గూర్చి నొక్కి చెప్తూ మోక్షసాధనకున్న సాధనాలన్నిటిలోనూ 'భక్తి రేవ గరీయసీ' అన్నది. సాధకుడి మనసులో తగినంత భక్తి లేకపోతే ఆ మంత్రజపంగానీ గురుసేవగానీ సవ్యంగా చేయలేడు. గురూపదేశాన్ని కూడా సవ్యంగా ఆచరించలేడు.

శ్రీ సాయిబాబా దగ్గరకు అనేక రకాల వ్యక్తులు వచ్చేవారు. ఓసారి దాసుగణు వలంబికి చెందిన స్టేషనుమాస్టరును బాబా దర్శనానికి తీసుకువచ్చాడు. అతనికి బాబా పట్ల ఏమీ నమ్మకం కలగలేదు. ఆయన్ను అనవసరంగా ఆకాశానికి ఎత్తేస్తున్నారని విసుక్కున్నాడు కూడా. వాళ్లు వచ్చిన సమయంలో బాబా వారు పాత్రలు కడిగి తలక్రిందులుగా ఉండేలాగా బోర్లించి పెడుతున్నారు. అలా ఎందుకు పెడుతున్నారని అడిగారు వచ్చినవారు. బాబా "నా దగ్గరకు వచ్చేవాళ్లు కొందరిలాగే వస్తారు" అన్నారు. మూతులు క్రిందికి ఉంచుకొని వచ్చేవాళ్లు బాబా ఉపదేశామృతాన్ని ఎలా స్వీకరించగలరు మరి! సరిగ్గా వలంబి స్టేషను మాస్టరుకు సరిపోయిందిది. మనలో గట్టి విశ్వాసం లేకపోతే మన గురువుకు వ్యతిరేకంగా ఎవరైనా విమర్శించటం ప్రారంభించినా, ఆయన ఉపదేశాలను విమర్శించినా - ఆయన మనకు నచ్చని విషయాలు చెప్పినా - ఆ గురువును అలక్ష్యం చేస్తాం, లేదా పూర్తిగా వదిలేస్తాం. డా॥ మల్కీ అనే ఆయన తన చెల్లెలి మాట ప్రకారం షిర్డీ వెళ్లి సాయిదర్శనం చేసుకుందామను

కొని కోపర్‌గాంవ్ స్టేషనుకు వచ్చాడు. అక్కడి రైల్వే ఉద్యోగులు బాబా చాలా ప్రమాదకరమైన నీతిబాహ్యుడని చెప్పారు. డా॥ మల్కీ వెంటనే ప్రయాణం విరమించుకొని ఇంటికి వెళ్లిపోయాడు. ఇలా చాంచల్యం ఉన్న మనుష్యులు మొదట విశ్వాసం పెంచుకొంటేనేగానీ సత్ఫలితాన్ని పొందలేరు. బాబా అలా ఎంతోమందికి సహాయం చేశారు. ఇప్పుడు మన మల్కీ సంగతే చూద్దాం. అతని చెల్లెలు అతన్ని మళ్ళీ ప్రోత్సహించి షిరిడీ పంపింది. ఈసారి బాబాగారు అతన్ని చూడగానే అతడు అంతకుముందు వద్దామనుకొని కూడా వెనుదిరిగి పోయిన సంగతీ, అందుకు కారణమూ కూడా చెప్పారు. దానితో అతనికి బాబా పట్ల అచంచలమైన విశ్వాసం ఏర్పడింది.

మరోసారి ఎస్.బి.నాచ్నే మన్‌మాడ్ రైల్వే స్టేషన్‌లోని వారి మాటల వలన మానసికంగా కొంత సంచలనం చెందాడు. బాబా పట్ల విశ్వాసం చెదిరే పరిస్థితిలో పడ్డాడు. ఆ తర్వాత ఎప్పుడో ఆయన షిరిడీ వచ్చినప్పుడు బాబా అతనిలో విశ్వాసం పాదుకొల్పడానికి "నీ మమలతదారు అనుమతి లేకుండా ఎందుకు వచ్చావు? మరోసారి ఇలా చెయ్యకు" అని మందలించారు. దానితో బాబా అద్భుతమైన శక్తి గురించిన విశ్వాసం బలపడింది నాచ్నేలో.

"గురౌ మనుష్యతా బుద్ధిః శిష్యాయ యదిజాయతే
నహితస్య భవేత్ సిద్ధిః కల్పకోటి శతైరపి"

- అంటే గురువుని సామాన్య మానవుడుగా (మానవ మాత్రునిగా) భావిస్తే మన సాధన ఘోరంగా దెబ్బతింటుంది. భగవంతుని గ్రహించాలంటే గురువు పట్ల విశ్వాసం చాలా అవసరం. తనను తాను పరబ్రహ్మగా గుర్తెరిగిన సద్గురువు తన శిష్యుని ఆత్మను సరియైన అదునులో నిద్రలేపగలడు. అది కూడా ఒక్క సైగతోనో, ఒక్కమాటలోనో అప్పటికప్పడు జ్ఞానోదయం అయ్యేలా చేయగలరు. ఆ క్షణంలోనే జీవబ్రహ్మ ఐక్యస్థితి అనుభూతిని కలిగించగలరు. ఈ స్థితి గురువులు "నిమిషేన నిమిసార్థేన" కలిగించగలరని చెప్పింది గురుగీత. అయితే ఇదంతా చాలా ముందరనుంచి గురువు శిష్యుని ఆత్మపై చూపించే ప్రభావానికి ఒక పరాకాష్ఠ అని చెప్పవచ్చు. దీనికి జనకుడు అష్టావక్రుల కథే తార్కాణం.

✡





# అక్షతాశీస్సులు

సత్తెనపల్లి వాసులు శ్రీమతి లీలావతి, శ్రీ గోవిందుని సుబ్బారావుగారలు తమ జ్యేష్ఠపుత్రుడు చి॥ సత్యశ్రీకాంత్‌కు శ్రీ అబ్బూరు రామమూర్తి (బాపట్ల)గారి పుత్రిక చి॥సౌ॥ హరిప్రియనిచ్చి ఆగస్టు నెల 15వ తేదీన బాపట్లలో శాస్త్రోక్తంగా వివాహక్రతువు నిర్వర్తించారు. ఈ నవదంపతులు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, పుత్ర పౌత్రాదులతో చిరకాలం పచ్చగా బ్రతకాలని గురుదేవుల ఆశీస్సులు అందిస్తున్నది సాయివాణి.

చిరకాల మిత్రులు, శ్రీ సాయి నాగేంద్రాలయం బాలానగర్ వ్యవస్థాపక అధ్యక్షులు, సద్భక్తులు శ్రీమతి అంబటి అరుణ, శ్రీ ప్రసాదరావు గారలు తమ పుత్రిక చి॥సౌ॥ నాగపల్లవి వివాహం కర్నూలు వాస్తవ్యులు శ్రీ మధుసూదన రావుగారి పుత్రుడు చి॥ మురళీకృష్ణతో ఆగస్టు 15వ తేదీ ఉదయం అంగరంగవైభవంగా జరిపించారు. ఈ నవదంపతులు పరస్పరాను రాగాలతో జీవించి, సత్సంతానవంతులై చక్కని ధార్మిక జీవనంతో దీర్ఘాయుష్మంతులై వర్ధిల్లుదురు గాక! - అని పరమపూజ్య శ్రీ గురుదేవుల ఆశీస్సు.

శ్రీమతి మామిడన్న కాత్యాయనీదేవి, శ్రీ వెంకట పాండురంగారావుగారలు తమ కనిష్ఠ పుత్రిక వెంకటనాగ సుందరీ రమ్య, ఎం.ఎస్‌సి(సి.ఎస్)ను, రాజమండ్రి వాస్తవ్యులు చి॥ పులుగుర్తి వెంకట కామేష్‌కిచ్చి కొత్తపేటలో (హైదరాబాదు) 26-08-2010న సలక్షణంగా కళ్యాణం జరిపించారు. ఈ క్రొత్త జంట పుత్రపౌత్రాభివృద్ధిగా చిరకాలం ఆరోగ్యంగా జీవింతురుగాక!-అని గురుదేవుల మంగళాశీస్సు.

పదహారు సంవత్సరాలుగా సాయిధామంలోని 'ఉష' శిశు మందిరంలో పెరిగిన చి॥సౌ॥దివ్య (ఎం.ఏ, బి.ఇడి) వివాహం మెదక్ జిల్లా జోగిపేటకు చెందిన ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగి అయిన చి॥మాడబోయిన అశోక్‌రాజ్ (ఎం.బి.ఏ)తో ఆగస్టు 27వ తేదీ ఉదయం గం.11-20ని.లకు సాయిధామంలోని ద్వారవతిలో శ్రీ సాయిసన్నిధిలో జరిగింది. వరుని తరఫు బంధుబలగంతోపాటు సాయిధామం భక్తులు, అభిమానులు అనేకులు ఈ వివాహానికి వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. ఈ నవదంపతులు ఒకే దృష్టి, ఒకే మాట, ఒకే బాటగా జీవించి, సత్సంతిని కని, లోకోపకార దృష్టితో ఆనందమయమైన సఫలజీవితాన్ని గడుపుదురుగాక!-అని గురుదేవుల ప్రేమాశీస్సులు, సాయివాణి అభినందనలూను.

# వీధి దేవతలు

**- "మరో జంఘాల శాస్త్రి" నుండి**

జంఘాల శాస్త్రి ఇట్లుపన్యసించెను :

నాయనలారా! మన సాక్షి సంఘాభిమాని యొక్కడీ లేఖ వ్రాసినాడు. విషయవైవిధ్యమును దృష్టిలోనిడుకొని ఈ లేఖను చదువుచున్నాను. ఆలకింపుడు.

సాక్షికి,

నరసింహశాస్త్రి నమస్కరించి వ్రాయునది. నేను మీ 'సాక్షి' సంఘాభిమానులలో ఒకడను. ప్రతి వారమును 'సాక్షి' ఉపన్యాసములు చదివి, ఆనందించు వేలాది పాఠకులలో నేనొకడను. నాకు జంఘాల శాస్త్రివలె వాక్చాతుర్యము లేదు. మీ వాణీదాస కవివలె కవితా పటిమ లేదు. కాలాచార్యుని వలె వైష్ణవమత సంప్రదాయములపై అవగాహన లేదు. మీవలె సర్వవిషయ పరిగ్రహణ జ్ఞానము లేదు. ఏమియు లేనివాడిని లేనట్టు పడియుండక మరి యీ ఉత్తరము ఎందులకని మీరడుగవచ్చును. రాష్ట్రములో, ముఖ్యముగా రాష్ట్ర రాజధానిలో వీధి వీధినా వెలసిన వీధి దేవతలను గూర్చి నా మనసులో మెదిలిన భావములను, నాకు వచ్చిన భాషలో మీ ముందుంచుటకు ప్రయత్నము చేయుచున్నాను. నాకు మన జంఘాలశాస్త్రివలె శబ్ద చాతుర్యముగాని, అర్థగాంభీర్యముకాని లేవు. ఈ ఉత్తరమును సాంతము చదివిన తరువాత ఇది మీ సాక్షి సంఘ సమావేశములలో పఠనయోగ్యమో లేక చిత్తు కాగితముల బుట్టకు యోగ్యమో మీరే నిర్ణయించుకొనుడు.

ఈ సృష్ట్యాదియందు ప్రథమముగ ప్రణవనాదముద్భవించిన దనియు, అటు పిమ్మట ఆది దంపతులు, త్రిమూర్తులు, చతు ర్వేదములు, పంచభూతములు, షడృతువులు, సప్త మహర్షులు, అష్ట దిక్పాలకులు, నవగ్రహములు, దశావతారములు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, చతుర్దశ భువనములు, అష్టాదశ పురాణములు వెలసినవనియు పండితులు





చెప్పదురు. అటులే బ్రహ్మ సత్య లోకమున, శ్రీ మహావిష్ణువు వైకుంఠమున, పరమశివుడు కైలాసమున వసించినట్లు మన పురాణములు తెలుపుచున్నవి. ఆది పరాశక్తి అష్టాదశ పీఠములందును, మహాదేవుడు ద్వాదశ జ్యోతిర్లింగములందును ప్రతిష్ఠితమైనట్లు కూడా తెలియుచున్నది.

కాలక్రమమున దేవతలు జనావాసములకు దూరముగ కొండల పైన, కోనలలోన వెలసినట్లు, అటు తరువాత తమ భక్తులది గమనించి, అచ్చట ఆలయములు నిర్మించి, పూజార్చనాది విధి విధానములను, ధూప, దీప నైవేద్యములను ఏర్పాటు చేసినట్లు ఆయా స్థల పురాణములు చెప్పచున్నవి. ఏడుకొండలపైన వెంకన్న, సింహాద్రి కొండపై అప్పన్న, యాదగిరి గుట్టపై శ్రీ లక్ష్మీనృసింహస్వామి, రత్నాచలముపై శ్రీ సత్య నారాయణస్వామి, ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ, శ్రీశైలముపై భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి, శ్రీకాళహస్తిలో శ్రీ కాళ హస్తీశ్వరస్వామి, శ్రీ కూర్మములో శ్రీ కూర్మనాథస్వామి, అరసవల్లిలో శ్రీ సూర్యనారాయణస్వామి, భద్రాచలముపై సీతాలక్ష్మణ సహిత శ్రీ రామచంద్రస్వామి, శబరిగిరిపై అయ్యప్పస్వామి, ఉడిపిలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి మున్నగు దేవీ, దేవతలు ఇట్లు వెలసినట్లు ఆయా స్థలపురాణముల వలన మనకు తెలియుచున్నది.

అటు తరువాత రాజులు తమ కీర్తిప్రతిష్ఠలనినుమడింప జేయుటకై జనావాసములందు దేవాలయములు నిర్మించి, అందులో శిలాఫలక ములపై శాసనములు వ్రాయించి, జయస్తంభములను వేయించి, సత్రములను కట్టించి, మండపములు నిర్మించి, జలాశయములను త్రవ్వించి, దానధర్మములు నిర్వహించి శాశ్వత కీర్తులైనారు. దక్షిణా పథమున వెలసిన అనేకానేక దేవాలయములిట్లు రాజులచే నిర్మింపబడి, శిల్పసౌందర్య సంపద కాలవాలములై అలరారుచున్నవి. ఇట్లు దేవాలయములు ప్రజలలో దైవభక్తిని ప్రేరేపించి, పాపచింతనను తరగజేసి ప్రజలను సన్మార్గములో నడిపించుటలో చక్కని పాత్ర పోషించినవి.

అటు తరువాత గ్రామగ్రామమున, గ్రామ ప్రజల బాగోగులు చూచుటకై గ్రామ దేవతలు వెలసిరి. నా మిత్రుడొకడు వీరిని 'లోకల్ గార్డియన్స్'గా

అభివర్ణించినాడు. వారు ఆ గ్రామ ప్రజల పూజలనందు కొనుచు, నైవేద్యములనందుచు, ముడుపులను స్వీకరించుచు, మ్రొక్కులను తీర్చుచు, ప్రతియేటా పండుగలు జరిపించుకొనుచు, తమ గ్రామ ప్రజలను చల్లగా చూచుచున్నారు. ఈ గ్రామ దేవతలలో అధికాధికము స్త్రీ రూపముననున్న శక్తి స్వరూపిణులే. అల్లూరిలో నున్న పోలేరమ్మ, అనకాపల్లిలోనున్న నూకాలమ్మ, విజయనగరములోనున్న పైడి తల్లెమ్మ, రాయగడాలోని మజ్జి గౌరమ్మ, మద్దివలసలోనున్న దుర్గమ్మ వంటివారు ఈ కోవకు చెందినవారే. ఇక్కడికి వచ్చుసరికి ప్రజలలో భక్తిభావము సన్నగిల్లినది. భయము పెరిగినది. ఈ పెరిగిన భయము అనేకానేక మూఢాచారములకు మూలమయినది. మ్రొక్కులు తీర్చకున్న, ముడుపులు చెల్లించకున్న, సన్మార్గములో నడువకున్న ఆ తల్లి బాధించి, వేధించుచున్న భయము ప్రజలను ఆమె పట్ల భక్తి భావముతో మెలగునట్లు చేసినది. స్త్రీ శక్తి, భగవద్భక్తి కంటే అధికతరమయినదని ఋజువు చేసినది.

మరిప్పడు భక్తిశ్రద్ధలు అడుగంటినవి. భయము కూడా సన్నగిల్లినది. సందు సందునా, వీధి వీధినా, పేటపేటనా, ప్రతి రహదారి ప్రక్కన దేవతలు వెలయుచున్నారు. వెలయుచున్నారనుట కంటే వెలయింపజేయుచున్నారనుట సమంజసముగనుండునేమో? నల్ల పోచమ్మ, కట్ట మైసమ్మ, రేణుక ఎల్లమ్మ, పీనుగుల మల్లన్న, తలుపులమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, బల్కమ్మ తల్లి, నీలమ్మ తల్లి, ముత్యాలమ్మ తల్లి, మహంకాళి, అభయాంజనేయస్వామి, సిద్ధి వినాయకుడు, ఇట్లు ఒకరా! ఇద్దరా! ఆరు కోట్లమంది ఆంధ్రులకు తోడుగ ముక్కోటి దేవతలు ఆంధ్రప్రదేశమున వెలసిరి.

ముఖ్యముగ రాజధాని నగరమైన హైదరాబాదు నగరమునకు ఈ దేవతల తాకిడి ఎక్కువయినది. కోస్తా, రాయలసీమ ప్రాంతముల నుండి హైదరాబాద్ నగరమునకు ఉద్యోగములకై తరలివచ్చిన తెలుగువారి వలె, ఈ దేవతలు కూడ హైదరాబాద్ నగరమునకు తరలివచ్చినారు. వీధివీధినా, పేటపేటనా వెలసినారు. భూకబ్జాదారులకు, భూబకాసురులకు, బ్రోకర్లకు వీరు ఆరాధ్య దైవములు, ఇలవేల్పులు. ఈ భూబకాసురులు ఎక్కడయినా అనువైన





ఖాళీస్థలములున్నచో, రాత్రికి రాత్రి ఓ ఇష్టదేవతా విగ్రహమును ప్రతిష్ఠించి, ఆ దేవత అచ్చట వెలసినట్లు నాలుగు రోజులు ప్రచారము చేసి, పూజా పునస్కారములు, ధూప, దీప నైవేద్యములు నేర్పాటు చేయుదురు అటు తరువాత ఆ చుట్టుప్రక్కల గల ప్రజల నుండి చందాలు వసూలుచేసి, విరాళములు స్వీకరించి, ఓ చిన్న గుడిని కట్టింతురు. అంతే! ఆ తరువాత ఆ స్థలములో ముందువైపు ఓ చిన్న వ్యాపార సముదాయము, వెనుక భాగమున గృహసముదాయమును వెలయింపజేయుదురు. అనంతరము తన చేతి క్రింద పనిచేయు ఓ నలుగురితో 'ఆలయ కమిటీ' నొకదానిని ఏర్పాటు చేసి, అటు ఆలయములో వచ్చిన ఆదాయమును, ఇటు వాణిజ్య, గృహ సముదాయము నుండి వచ్చు ఆదాయమును స్వాహా చేయుదురు.

**(ఇంకా ఉంది)**

---

# సర్వం సాయిమయం

**(16వ పేజీ తరువాయి)**

అంతరంగ పరిశుద్ధత. బాహ్యాలంకారాలు వీరికి అవసరం లేదు.

హరికథ ముగింపు సమయంలో హారతి వెలిగించి, భక్తులు అందరి వద్దకు పళ్లెంలో ఆ హారతిని తీసుకునివెళతారు. భక్తులు తమకు తోచిన దక్షిణలు, కానుకలు ఆ హారతి పళ్లెంలో వేస్తారు. అవి హరిదాసుకు చెందుతాయి. దాసగణు హారతిని వెలిగించేవారు, కాని కానుకలను ఏమాత్రం స్వీకరించేవారు కాదు.

దాసగణు హరికథల వల్ల ఎందరో సాయి అంకితభక్తులు అయ్యేవారు. అనేక మహత్తులు కూడా సాయికృపతో జరిగేవి.

సాయి శరణం - బాబా శరణం

బాబా శరణం - సాయి శరణం

**సేకరణ : తిరుమలశెట్టి వేంకట సుబ్బారావు,**

★

# కంఠస్థ యోగ్య పద్యాలు

‘ఉత్తర హరివంశం’ నాచన సోముని రసమయ సృష్టి. హంసడి భకోపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలతో నిండిన శ్రీ కృష్ణ వృత్తాంతం యిది. “కరవగ వచ్చునే బలిమి గాడిదకుం బులితోలు కప్పినన్ - పాము కాటు చీర దుడిచినం బోవునె - పిడుగు వ్రేసిన దలటొప్పియాగునే-దాగంబోయి తలారి వాని ఎదుట దాగంగ నీకేటికిన్” ఇలాటి ఎన్నో సామెతలు, అంతు లేనన్ని జాతీయాలు, నుడికారాలతో తెలుగు సోయగాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన కావ్యం ఉత్తర హరివంశం. అందులోది యీ పద్యం.

మనుష్యులందరూ ఒకేరకంగా ఉండరు. అనేకానేక రకాలుగా అనంత వైవిధ్యం కన్పిస్తుంది నరజాతిలో. అందులో ఒకదాన్ని వివరిస్తున్నాడిక్కడ కవి. కొందరు తమ చుట్టూ ఉన్న వారికి ఎంతో మేలు చేస్తారు. ఒకసారి చేసిన దాన్ని గురించి ప్రస్తావించనైనా ప్రస్తావించరు. అలాటప్పుడు ఎదురు ఏదైనా ఆశించడమన్న ప్రశ్నే ఉండదు గదా! మధ్యరకం మనిషి సాటి వారికి మేలు చేస్తాడు. కానీ, ప్రతిఫలంగా ఏదో ఒకటి ఆశిస్తాడు. కనీసం మేలు పొందినవారు తన పట్ల కృతజ్ఞత చూపించాలనైనా ఆశిస్తాడు. అధముడైన వ్యక్తి తానెవ్వరికీ ఏమీ చెయ్యడు సరిగదా- ఇతరులు ఎవరైనా చేసే ఉపకారాలను కూడా అణచిపెడతాడు-పైకి రాకుండా చేస్తాడు. అంటే అవి ఫలించకుండా చేస్తాడు.

వీరు కాక మరో జాతి మనుషులున్నారు. వీరికి ఏం పేరు పెట్టాలన్నది ఎవరికీ అర్థం కాదు. వీరు ఆ మేలు సాగనివ్వరు. అంతేకాదు- లోకానికి హితం చేసే వారికే కీడు తలపెడతారు. పేరు చెప్పరాని నీచులు వీరు. స్థిరచిత్తంతో పరోపకారమే పరమార్థంగా జీవించేవారిని వీరి చేష్టలేమీ బాధించవు. కానీ, ఏదో సహృదయంతో కాస్త ఏదైనా మంచి చేద్దాం అనుకొనే వారికి యీ నీచతత్త్వం చాలా వేదన కలిగిస్తుంది. “ఏదో మంచి చేద్దామనుకోవటం ఎందుకు- ఇలాటి మాటలు పడటం, నెత్తికి తెచ్చుకోవటం ఎందుకు”-అని నీరసించిపోతారు. ఈ భావాన్ని చెప్పే పద్యం నేర్చుకొందాం. మనం ఏ తెగకు చెందినవారమో ఆలోచించుకుందాం.

**“ఉత్తముండు హితము జేసియూరకుండు,**
**మధ్యముండు హితము చేసి మారు వెదకు,**
**నధముడొరుచేయు హితమైన నణచిపుచ్చు**
**హితమునకు నెగ్గు చేయువాడెవ్వడగును!”**





# సర్వం సాయిమయం

## కీర్తనకారుడు-చరిత్రకారుడు

గణపతిరావు దత్తాత్రేయ సహస్రబుద్ధే అంటే వెంటనే ఎవరో తెలియదు కాని దాసగణు అంటే తెలియని వారుండరు. సాయి అతనిని ‘గణూ’ అనేవారు. హరికథలు చెప్పడం వలన ‘గణూదాస్’, దాసగణు అయ్యాడు.

శ్రీసాయినాథుని మానవాతీతమైన మహత్తర శక్తి సంపద, అమోఘమైన దివ్యలీలలు, వర్ణనాతీతమైన విభూతిప్రసాద మహిమ పలు ప్రాంతాలలో వ్యాప్తి చెందడానికి ముఖ్యకారకుడు శ్రీదాసగణు మహారాజు.

దాసగణును తొలిసారిగా డిప్యూటీ కలెక్టరు అయిన నానాసాహెబ్ చందోర్కర్ సాయిబాబాకు పరిచయం చేశాడు. నానాతో సాయి “ఈతనికి వీధి నాటకములన్నా, పోలీసు ఉద్యోగమన్నా ఇష్టము. ఈ రెంటినీ విడిచి పెట్టమని చెప్పుము” అన్నారు. నానా చెప్పాడు దాసగణు వినలేదు. సాయిబాబా కూడా చెప్పారు. దాసగణు వినలేదు. జీవితంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలని దాసగణు ఎన్నో కలలు కనేవాడు. ఎలాగైతేనేమి చివరకు సాయిబాబా అతడిని పోలీసు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేటట్టు చేశారు.

పోలీసు సంకీర్తనకారుడయ్యాడు. దాసగణు చెప్పే హరికథలకు వేలకు వేలమంది హాజరయ్యేవారు. భక్తిభావంతో హరికథ చెప్పే సమయంలో ఆయన కంటిలో నీరు వచ్చేది. కంఠం గద్గదమయ్యేది. ఒకసారి హరికథ చెప్పడానికి సాంప్రదాయకదుస్తులలో వచ్చిన దాసగణుతో సాయిబాబా ఆ అలంకారములు అన్నియు తీసివేసి శరీరంపై భారం లేకుండా వెళ్ళు అని చెప్పారు. అప్పటినుండి అతడు కీర్తన సమయంలో ఎప్పుడూ చొక్కా లేకుండా, చేతిలో చిరుతలు, మెడలో మాలను ధరించేవాడు. ఆచారానికి విరుద్ధమయినా, ఇది అత్యంత పరిశుద్ధమైన పద్ధతి. ఇది ప్రబుద్ధులలో ప్రబుద్ధుడయిన నారదుని ప్రసిద్ధ మార్గం అసలు ఇక్కడ నుండే హరిదాసుల పరంపర ప్రారంభమయ్యింది. వీరి ధ్యేయం

**(మిగతా 14వ పేజీలో)**

# ఇంద్రద్యుమ్నుని కథ

ఇది మహాభారతం. అరణ్యపర్వంలో మార్కండేయుడు ధర్మరాజుకు చెప్పిన గాథ.

పూర్వం ఇంద్రద్యుమ్నుడనే ప్రభువు అనేక సత్కార్యాలు చేసి, ఆ పుణ్యఫలం వలన స్వర్గానికి వెళ్లాడు. అయితే-ఆయన పుణ్యకార్యాల వలన వచ్చిన కీర్తి భూమిపై లేకుండాపోయింది. దానితో ఇంద్రసేవకులు "అయ్యా, నువ్విక భూలోకానికి పోవలసిందే" అని పంపించివేసారు. ఆయన భూలోకానికి వచ్చాడు. పరమశివుని కరుణ వలన చిరంజీవిగా ఉన్న మార్కండేయుని చెంతకు వెళ్లి, "స్వామీ, మీరు ఇంద్రద్యుమ్నుని ఎరుగుదురా?" అని అడిగాడు. మార్కండేయుడు "వారెవరో నాకు తెలియదు. అయితే - హిమాలయ శిఖరాలపైన ఒక గుడ్లగూబ ప్రావారకర్ణుడు నివసిస్తున్నాడు. ఆయన నాకన్నా పెద్దవాడు. అతనికి తెలిసి ఉండవచ్చు. వెళ్లండి' అని ప్రావారకర్ణుని నివాసానికి ఇంద్రద్యుమ్నుని వెళ్లమన్నాడు. దేహ తాపం ఎక్కువగా ఉండటంతో తాను రాలేనని మార్కండేయుడు తన అశక్తతను చెప్పకున్నాడు. అప్పడా మహారాజు అశ్వమై మార్కండేయుని తనపై ఎక్కించుకొని హిమశైల శిఖరాలకు చేరుకున్నాడు.

ప్రావారకర్ణుడు మిక్కిలి వృద్ధుడైన ఉలూకం-అంటే గుడ్లగూబ - ఆయన చెంతకు వెళ్లి, "నేను ఇంద్రద్యుమ్నుడనే ప్రభువును. దానధర్మాదులలో ప్రసిద్ధుడను. నన్ను మీరెరుగుదురా?" అని అడిగాడు రాజు. ఆయన కొంతసేపు ఆలోచించి తల విదిలించాడు. "నాకు నీవు గుర్తు రావటం లేదు. ఇక్కడికి దగ్గరలో ఇంద్రద్యుమ్నం అనే కొలనున్నది. అందులో నాళీకజంఘుడనే పేరు గల ఒక కొంగ ఉన్నది. అది నాకన్నా పెద్దది". మహారాజు మార్కండేయుని, గుడ్లగూబనూ, కొంగనూ కూడా మోసుకొని సరస్సు చేరుకున్నది. ఆ కొంగ చా................లా పెద్దది. ఇంద్రద్యుమ్నుని ప్రశ్న విని చాలాసేపు ఆలోచించింది. చివరకు "నిన్నెరిగిన గుర్తు ఏమీ తగలటం లేదు నాయనా! నాకన్నా పెద్దది ఒక కచ్ఛపం ఉన్నది యీ సరస్సులోనే. ఆ తాబేటి పేరు అకూపారుడు. దానికేమైనా నీ పేరు మతికి తగులుతుందేమో అడుగుదాం పదండి" అన్నది. అందరూ కలిసి అకూపారుడున్నవైపుకు వెళ్లారు.

నాళీకజంఘుడు ఆ కొలని దగ్గరకు వెళ్లి "ఒక ధర్మసందేహం



సాయి వాణి

తీర్చుకోవడానికి వీరంతా వచ్చారు. అకూరపారా, నీవొక్కసారి బయటకు రావాలి" అని పిలువగానే కచ్ఛపం బయటకు వచ్చింది. "ఇంద్రద్యుమ్నుని నీ వెరుగుదువా?" అని అడగగానే దాని కళ్లనిండా నీళ్లు వచ్చాయి. దుఃఖంతో కంఠం బొంగురుబోయింది. "అయ్యో! ఆ పరమపుణ్యశీలి అయిన ఇంద్రద్యుమ్నుడు నాకు తెలియకపోవటం ఏమిటి నాయనలారా! ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా నన్ను కాపాడినాడాయన. పరమకరుణాళువు. ఆయన ఎన్నెన్నో యజ్ఞయాగాలు చేసినవాడు. ఆ సమయాలలో బ్రాహ్మణులకు ఆయన చేసిన గోదానాలు అనంతం. ఆ దానాల కోసం యిక్కడికి తెచ్చిన ఆలమందల కాళ్ల గిట్టల తొక్కిడి వలన ఇక్కడ ఏర్పడిన గొయ్యే యీ సరస్సు. అందుకే దీనికి ఇంద్రద్యుమ్నం అనే పేరు వచ్చింది. ఆ మహానుభావుని మరచిపోవటం ఎలా నాయనా!" అన్నది ఆ కచ్ఛపం ఎంతో ఆర్ద్రంగా.

అది తన మాటలు పూర్తి చేసేటప్పటికి దివ్య విమానం వచ్చి ఆగింది. దేవదూతలు ఇంద్రద్యుమ్నునికి నమస్కారం చేసి "మహాత్మా, నీ కీర్తి చిరంజీవులైన వీరంతా వినటం చేత యిక సుస్థిరమైపోయింది. ఇక మీ స్వర్గలోక వాసం కూడా శాశ్వతమైనట్లే. దయచేసి విమానం ఎక్కండి" అన్నారు. పైగా అక్కడున్న వారందరికీ యిలా చెప్పారు-"మానవుని కీర్తి ఎంతకాలం ప్రపంచంలో శాశ్వతంగా నిలబడి ఉంటుందో అంతకాలం ఆ మానవునికి స్వర్గలోక సౌఖ్యం లభిస్తుంది".

-ఇప్పడు విన్నాం గదా! మనకు మానవజన్మ లభించటమే మహాభాగ్యం. ఈ జన్మలోనే మనకు మోక్షసాధనకు ప్రయత్నించే వివేకం ఉంటుంది. మోక్షసాధన చేసేంత శక్తి లేకపోయినా కనీసం స్వర్గం సంపాదించేపాటి పుణ్య కార్యాలైనా చేసుకోగలగాలి. లేకపోతే నరకాగ్నిలోపడి నానాహింసలూ అనుభవించవలసి వస్తుంది. అంచేత-శాశ్వతంగా మన పేరు ఈ పృథ్వీతలంపై నిలిచిపోగల మంచిపనులు - తోటలు వేయించటం, బావులు త్రవ్వించటం, చెరువులు త్రవ్వించటం, దేవాలయాలు నిర్మించటం, పాఠశాలలు కట్టించటం ఆసుపత్రులు, ఆశ్రమాలు, గోశాలలు వంటివి నిర్మించటం - యిలాటి పుణ్యకార్యాలు చేయటం ఎంతో అవసరం. మొత్తం బరువు మనమే మొయ్యా లేకపోతే - అలా చేస్తున్న వారికి సహకారం అందించగలిగినా మంచిదే. అక్కడ మన పేరు వ్రాసి ఉండనక్కరలేదు. అవి ఉన్నంతకాలం మన కీర్తీ ఉంటుంది. అయ్యా అదీ సంగతి! అంచేత త్వరపడదాం.

# ఆదిగురువు - శ్రీ దత్త ప్రభువు

**(గత సంచిక తరువాయి)**

"స్వామీ! మీరు సెలవిచ్చిన అమృతవాక్కులు నాకెంతో ఆనందాన్ని కలిగించాయి. కానీ నేను విన్నది నా మనసులో స్థిరంగా నిలవాలి గదా! నా చాంచల్యం పోయి ఆత్మవిచారాన్ని గట్టిగా పట్టు వదలకుండా పట్టుకొనే మార్గం ఏదో సెలవిచ్చి నన్ను తరింపజేయండి" అని అడిగాడతడు. దత్తాత్రేయుడు అతన్ని కరుణార్ద్రదృక్కులతో తడుపుతూ అలా అన్నాడు - "నాయనా, చాంచల్యం అనేది ఎలా కలుగుతున్నది? ఎక్కడ కలుగుతున్నది? అది తెలుసుకో మొదట. ఇది మనసులో కలుగుతోంది. మనసు తీసే పరుగుల వల్ల కలుగుతోంది. మనస్సు వాయుతత్త్వంతో కూడినది. చలనం అనేది వాయువుకు సహజ లక్షణం గదా! మనస్సును అరికడితే అన్నీ చక్కబడతాయి. ఆ మనస్సుకు మూలాధారం ప్రాణం (వాయువు). కనుక ప్రాణాన్ని మొదట నిరోధించాలి. దానికి ప్రాణాయామం చక్కని మార్గం. గురువు ముఖతః ప్రాణాయామం గురించి విని, అభ్యసించి, అటుపైన సాధన చెయ్యాలి. ఈ మనసు మహా తుంటరిదయ్యా! చీటికీ మాటికీ ఇటుఅటూ పరుగులు పెడుతుంటుంది. దాన్ని మళ్ళీ పట్టి తేవాలి. ఒకవేళ నిద్రకుపడితే తట్టి లేపాలి. మనసులోనే రెండవభాగం ఉంటుంది. అది సాక్షిగా చూస్తుంటుంది. దాని సహకారం తీసుకొని ఆలోచనాత్మకమైన మనసును త్రోవకు తేవాలి. అంటే మంచిచెడులను వివరిస్తుండాలి. 'ఎవరికి, ఎవరు?' అంటే మనస్సు మనస్సుకే. అటుపైన క్రమంగా ప్రత్యాహారం, ధ్యానం, ధారణ మొదలైన వాని సాధన సాగుతుంది. ఈ ధారణ చాలా మెలకువతో, జాగ్రత్తగా దాటవలసిన మెట్టు. ఇది దాటితే యిక సమాధ్యవస్థ. నిద్రావస్థకూ, సమాధికీ అట్టే భేదం ఉండదు. అందుచేత జాగ్రత్తగా ఉండాలి ఈ దశలో. నిద్రలో అవయవాలన్నీ ఏ సంచలనం లేకుండా ఉంటాయి. సమాధిలోనూ అలాగే ఉంటాయి. అయితే-నిద్రలో వాటి వశంలో అవి ఉండవు. స్తబ్ధమైపోతాయి. కాని సమాధిలో అలా కాదు - విషయాలపైనుండీ ఇంద్రియాలన్నీ విముఖాలై ఒకేచోట లయిస్తాయి. ఆ చోటే పరమాత్మ. చేతన కూడా





ఉండి అదుపులో ఉండేది సమాధి. నిశ్చేతనాలై పడి ఉండేది నిద్ర. ఈ తేడా బాగా గుర్తుంచుకోవాలి.

సమాధి స్థితికి చేరుకొన్న సాధకునికి ఎన్నెన్నో శక్తులు - అణిమ, మహిమ మొదలైన సిద్ధులు లభించవచ్చు. వాటి మాయలో పడిపోయాడా-ఇక సాధకుని పని అయిపోయినట్లే. వాటిని ప్రయోగించి ప్రదర్శించటం ప్రారంభిస్తే యోగసాధనకు అంతకుమించిన భ్రష్టత్వం ఉండదు. ఈ విషయంలో అత్యంత జాగరూకత అవసరం. నాయనా! నీ లోపల ప్రజ్వరిల్లుతున్న అనుభూతి కాంక్ష నాకు అర్థమైంది. అదిగో-ఆ కనిపించే గుహ లోపలికి వెళ్ళి స్థిరాసనంలో కూర్చొని సాధన చెయ్యి". కార్తవీర్యార్జునుడు ఆయన ఆదేశాన్ని పాటించాడు. సమాధిస్థితిలోని మహదానందాన్ని అనుభవించాడు. అటుపైన శ్రీ దత్తుడు అతని ధ్యాన సమయాన్ని పెంచుతూ పెంచుతూ అతన్ని గొప్ప యోగిగా తయారుచేసి, ఆశీర్వదించి యిక రాజ్యానికి వెళ్లమన్నాడు. ఆయన వెళ్లిపోయాడు.

ముక్తిమార్గంలోకి మనిషిని తీసుకువెళ్లే మార్గాలు ప్రధానంగా నాలుగున్నాయి. భక్తియోగం, కర్మయోగం, రాజయోగం, జ్ఞానయోగం. భక్తియోగం అత్యంత నిరపాయమైనది. భగవానుని మీద ఆధారపడి, ఆరాధించి, ప్రేమించి, లయించిపోవటమే భక్తి పరమాత్మతో నిరంతర బంధం ఉండే యోగం అది. కనుక భ్రష్టత్వానికి ఎక్కువ అవకాశం ఉండదు. రెండవది కర్మయోగం. నిరంతరం లోకకళ్యాణకారకాలైన కర్మలు చేస్తూ కర్మఫలాన్ని దైవార్పితం చేస్తూ జీవించేది కర్మయోగం. ఇందులో 'నేను చేస్తున్నాను' అన్న అహంగానీ, 'నా వలన ప్రయోజనం పొందినవారు నాకు కృతజ్ఞులై ఉండాలి' అన్న స్వార్థంగానీ, 'నాకు కీర్తి రావాలి' అన్న కాంక్షగానీ రాకుండా ఉన్నంతవరకు ఇది నిరపాయకరమైనదే. కానీ మనిషిలో మౌలికంగా యీ అహం, స్వార్థం వంటి లక్షణాలుంటాయి గనుక ప్రతిదీ 'దైవార్పణం' అనే భావంతో చెయ్యకపోతే యివి ప్రకోపించే అవకాశం చాలా ఎక్కువ. అయితే యీ యోగంలో ప్రయోజనం ఏమంటే - సాధకుడు పతనమైనా, అతని పనుల వలన లబ్ధి పొందిన వాళ్లకైనా మేలు

కలుగుతుంది. మూడవది రాజయోగం. ఇందులో యమ నియమ సాధన అత్యంత ప్రధానం. రాజయోగంలో కలిగే శక్తులు పదునుగా ఉంటాయి. యోగికి సంయమనం లేకుంటే ఆ శక్తులు పిచ్చివాడి చేతిలోని కత్తిలాగా ప్రమాదకరమయ్యే అవకాశం చాలా ఎక్కువ. చివరిది జ్ఞానయోగం. పై మూడు యోగాలూ కూడా ఇందులో పర్యవసించక తప్పదు. అయితే  భక్తి కర్మలు పాటించని జ్ఞానయోగంలో సాధకుడు అహంభావిగా మారే అవకాశం ఉంది. మిగిలిన అహంకారాలను జ్ఞానంలో తొలగించుకోవచ్చు. కానీ జ్ఞానాహంకారాన్ని తొలగించుకొనేందుకు ఇక మార్గమే లేదు. కనుక సాధకుడు ఏ దశలోనైనా 'అహం' అంటకుండా జాగ్రత్తపడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కార్తవీర్యార్జునుడు స్వయంగా దత్తస్వామి దగ్గరే ఆత్మజ్ఞానం పొందినవాడు. ఎంతో దీక్షగా సాధనలు చేసినవాడు. అయినా అతడు తనను తాను జయించలేకపోయాడు. మొదటే పొందిన వరాలు, చివర పొందిన ఆత్మజ్ఞానం-అన్నీ కలిసి అతనిలో జ్ఞానాహంకారంగా రూపొందాయి. బ్రాహ్మణుల నిత్యకర్మలుగానీ, భక్తుల కార్తీక స్నానాలు, మాఘస్నానాల వంటివిగానీ, మరేవిగానీ అతనికి అల్పంగా, హాస్యాస్పదంగా గోచరించసాగాయి. ప్రతి దానినీ తృణీకరించి మాట్లాడటం, తనలో తానే నవ్వుకోవటం ఎక్కువయ్యాయి. భుజబలం, వరబలం కలిసి కన్నూమిన్నూ కనబడకుండా చేసాయి. అతడు చేసే అవమానాలకు, అనే దుడుకు మాటలకు మనసు కష్టపడినా-దత్తస్వామి అంతటివాడికి భక్తుడు గదా- అని ఎవ్వరూ ఏమీ అనలేకపోయేవారు. ఒకసారి ఆయన నిండు పేరోలగంలో బ్రహ్మజ్ఞులైన వారందరినీ అవమానపరుస్తూ, హేళనగా మాట్లాడేసరికి వాయుదేవునికి చికాకు కలిగి, ఎడాపెడా చీవాట్లు పెట్టాడు. "నీ చొట్ట చేతులకు ఇంత శక్తి వచ్చిందంటే అది ఋషీశ్వరుడూ, యోగీశ్వరుడూ అయిన దత్తమూర్తి చలవకాక నీ ప్రతిభేననుకొంటున్నావా? ఇంత అహం నీకు మంచి చేయదు జాగ్రత్త సుమా!" అని హెచ్చరించాడు కూడా. తాత్కాలికంగా కొంత అదుపులోకి వచ్చినా మళ్లీ రెచ్చిపోయాడు కార్తవీర్యార్జునుడు. దేనికైనా ఒక హద్దు అంటూ ఉంటుంది. అది మీరిపోయినపుడు ప్రకృతే ఏదో ఒక రకంగా శిక్షించే ఏర్పాటు చూచుకొంటుంది.





ఒకనాడు భోజనాల వేళకు వచ్చాడు ఒక వృద్ధ బ్రాహ్మణుడు. దీనంగా నిలబడి తన ఆకలి తీర్చమని అడిగాడు. "కడుపునిండా కావలసినంత తినమన్నాడు కార్తవీర్యుడు. అతడు సంకోచిస్తూ నిలబడటం చూచి, తన యోగదృష్టితో వచ్చినవాడు అగ్నిదేవుడని గ్రహించాడు. దేవతలను సైతం ధిక్కరించగలంత అహంకారం కళ్లకు కమ్మి ఉన్నవాడు ఆ రాజు. కనుక "ఈ దేవతలు నన్ను పరీక్షిస్తారా!" అన్న భావంతో, "ఏమి విప్రోత్తమా సందేహిస్తున్నారు! మీకు కావలసినదేదో కడుపారా ఆరగించండి" అన్నాడు. వెంటనే అగ్నిదేవుడు తన సహజరూపం పొంది చెట్లూ, చేమలూ, లతలూ-మొత్తం వృక్ష సంతతులన్నీ దహించసాగాడు. అతనికి ఎవ్వరూ ఎటువంటి ఇబ్బందీ కలిగించకుండా ఉండేందుకై కార్తవీర్యుడు ధనుర్బాణాలతో అతనితోనే నడవసాగాడు. వృక్షాలను ఆశ్రయించుకొని ఉండే పక్షిసంతతులూ, వనైక జీవనాలైన జంతువులూ, ఋష్యాశ్రమాలలో జీవించే పెంపుడు జంతువులూ, పొలాలపై ఆధారపడే కృషిజీవనులూ, కేవలం గడ్డి తినే బ్రతకగలిగే గోగణాలూ అన్నీ అల్లాడిపోసాగాయి. ఈ కోలాహలం అంతా ప్రశాంతంగా తపోనిష్ఠలో ఉన్న వశిష్ఠ మహర్షికి వినిపించింది. ఆయన యోగదృష్టితో జరిగినదంతా గ్రహించాడు.

"కార్తవీర్యుడు మహారాజు. ప్రజలను, వారి సంపదను రక్షింపవలసిన బాధ్యత అతనికున్నది. కానీ, కేవలం తాను ఇచ్చిన మాట నిలుపుకోవాలనే గొప్పతనం కోసం - బ్రాహ్మణులు తననేమీ చేయలేరన్న అహంతో, అలక్ష్యంతో యిలా ప్రజల సొత్తును అగ్నికి అర్పిస్తున్నాడు. ఇది తామసదానం. బ్రహ్మజ్ఞుల పట్ల ఇంత తేలికదనాన్ని ఏర్పరచుకొన్న ఈ రాజు ఒక బ్రాహ్మణుని చేతిలోనే హతుడగుగాక!" అని శపించాడు వశిష్ఠుడు. 'బుద్ధిః కర్మానుసారిణీ' అన్నారు పెద్దలు. అయితే వశిష్ఠుని శాపం విని విరగబడి నవ్వాడు కార్తవీర్యుడు. "నిగ్రహానుగ్రహాలలో నన్ను మించిన వారు మరిలేరు. నాకు దత్తస్వామి వరం ఉన్నది. ఈ బాపనయ్య శాపం నన్నేమి చేస్తుంది!" అనేసాడు. మరికొంతకాలం అలాగే అవిచ్ఛిన్నమైన అహంకారంతో సంచరించాడు అతడు.

(సశేషం)

# ఆంధ్రరత్న-రామదండు

-మాన్యశ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి
"నా జీవితయాత్ర" నుండి

ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకూ 1921లో జరిగిన బ్రహ్మాండమయిన చరిత్రాత్మక సంఘటన ఇంకొకటి ఉంది. ఇది చాలా ముఖ్యమయినదీ, మరుపురానిదీ. ఇది చీరాల పేరాల ఉదంతంగా బాగా ప్రసిద్ధికెక్కింది.

చీరాల గ్రామం గుంటూరు జిల్లా కోస్తా ప్రాంతంలోనిది. అక్కడ జననమంది పేరు గాంచిన యోధానయోధుడు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. ఆయన మాంచి స్ఫురద్రూపి, సత్యసంధుడూ, విద్వాంసుడూ కూడాను. ఆయన ఎడింబరో విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం ముగించుకొని వచ్చిన తర్వాత కొంతకాలం రాజమహేంద్రవరంలోని గవర్నమెంటు ట్రైనింగ్ కాలేజీలో ఆచార్యుడుగా ఉండేవాడు.

ఈయన చాలా స్వతంత్రభావాలు గల వ్యక్తి. అచ్చటి ప్రిన్సిపాల్ ఆర్.డబ్ల్యు.దాస్ దొరగారు చూపించిన నిరంకుశత్వానికి నిరసనగా తమ ఆచార్య పదవికి స్వస్తి చెప్పి, బందరు జాతీయ కళాశాలలో కొంతకాలం అధ్యాపకులుగా పనిచేశారు. తర్వాత పదవీ పరిత్యాగం చేసి దేశమాత పిలుపును ఆకర్షించి, ఆమె సేవలో నిమగ్నుడయ్యాడు. చీరాల దూరతీరాలలోని ఇసుకపర్రలలో రామనగర గ్రామ నిర్మాణానికి పూనుకున్నాడు.

**విచిత్రయుద్ధం :**

అసలు విషయమేమిటంటే ఆ 1921వ సంవత్సరంలో పానగల్లు రాజాగారి జస్టిస్ పార్టీ వర్గానికీ, చీరాల ప్రజలకూ మధ్య పెద్ద యుద్ధమే ప్రారంభం అయింది. చీరాల-పేరల పంచాయితీ యూనియన్‌ని పురపాలక సంఘంగా మార్చాలని మంత్రివర్గం వారి పట్టుదల. గోపాలకృష్ణయ్యగారి ఆధ్వర్యాన దానిని పురపాలక సంఘంగా రూపొందించకుండా, ఎప్పటిలా యూనియన్‌గానే ఉండనియ్యమని ప్రజల కోరిక. ప్రజల కోరికను మంత్రిమండలి వారు మన్నించకపోవడంతో ప్రజలకూ, మంత్రివర్గం వారికీ మధ్య ఒక రకమయిన యుద్ధమే ఆరంభం అయింది.





ఇది చాలా విచిత్రమయిన యుద్ధం. ఆంధ్రరత్న ప్రజలందరినీ కూడగట్టుకొని, చీరాల ప్రాంతాన్ని మున్సిపాలిటీగా రూపొందిస్తే, ఆ గ్రామాన్ని పూర్తిగా విసర్జించి, వేరే తావులకు వలసగా వెడలిపోతామని తెలియజేశాడు. ఇది నిజంగా చాలా బ్రహ్మాండమయిన ప్రయత్నం. చీరాల-పేరాల ప్రజలు పదిహేడువేలమందికి పైగా ఉన్నారు. వారందరినీ ఒక త్రాటి మీద నిలబెట్టి, వారి చేత తరతరాలుగా వారు వుంటూ వున్న ఇళ్లనీ, వాకిళ్లనీ, విడిచిపెట్టించి, వారిని రామనగరు పరిసర ప్రాంతాలకు తీసుకొని పోవడం అంటే మాటలా? చీరాల వాసులతోటీ, ఆంధ్రరత్నతోటీ నాకు మంచి ఐక్యతా భావం ఉంది. వారి కోరిక న్యాయమైనదేనన్న భావమూ నాకు ఏర్పడింది. ఆ ప్రాంతమంతా పురపాలక ప్రాంతంగా మార్చబడే పక్షంలో గ్రామీణులకు గోరంత లాభం చేకూరకపోయినా, కొండంత భారం పన్నుల రూపేణా నెత్తిన పడడం అన్నది ఖాయం. అటువంటి క్లిష్ట సమయం అది. అప్పట్లో చీరాల-పేరాల వాసులకూ, ఆంధ్రరత్నకూ ఇవ్వగలిగినంత చేయూత ఇచ్చాను. నేను లక్షల మీద సంపాదిస్తున్న కారణంగానూ, బ్యాంకులలో నా ధనం మూలుగుతున్న కారణంగానూ, నేను ఆ ఉదంత విజయానికి చాలా విరివిగా విరాళం ఇచ్చాను.

**ఎర్రచొక్కాల సేన :**

ఆంధ్రరత్న "రామదండు" అన్న పేరు మీద ఎర్ర చొక్కాల సేనని ప్రోగుచేశాడు. గాంధీ మహాత్ముడు యావత్తు భారత దేశాన్నీ ఉద్ధరించాలని ప్రయత్నిస్తూ ఉన్న ఆ కాలంలో, ఆంధ్రరత్న చీరాల-పేరాల ప్రజల కోసం "రామదండు" స్థాపనతో ఒక విశ్వామిత్ర సృష్టే చేశాడు.

చీరాల-పేరాల ఉదంతం ఆ ప్రాంతానికే చెందిన సమస్య అయినా, దాని చండ ప్రభావం వల్ల అది ముఖ్యమయిన రాష్ట్ర సమస్యగానూ, తర్వాత సాటిలేని మేటి ఉదంతంగానూ రూపొందడం చేత, అది యావత్తు భారతావని దృష్టినీ ఆకర్షించింది. ఆ పోరాటం ముమ్మరంగా సాగుతూన్న రోజులలో నేను చీరాల ప్రాంతానికి వెళ్లాను. అచ్చట ఒక అపూర్వదృశ్యాన్ని చూశాను. ఆ గ్రామాలకు చెందిన యావత్తు జనమూ బీదా సాదా, ముసలీ ముక్కీ, బ్రాహ్మణ, అబ్రాహ్మణాది విభేదాలు యీషణ్మాత్రమూ లేకుండా ఏకగ్రీవంగా, ఆ గ్రామాన్ని వదలి ఇతర ప్రాంతాలలో స్థావరాలు ఏర్పాటు చేసుకోవడానికి

ఆనందంగా బయల్దేరారు. బీదవారు తమకు చెందిన తట్టాబుట్టా తమ నెత్తి మీద పెట్టుకొని స్వయంగా మోస్తున్నారు. ఇంతకంటే ఆశ్చర్యకరమైన సంఘటన ఉంటుందా?

1921లో గాంధీగారి అఖిల భారత సంచార కార్యక్రమం సందర్భంలో నేను వారితోపాటు చీరాల వెళ్ళాను. గాంధీగారు సహాయ నిరాకరణ ఉద్యమ ప్రథమ దినాలలో "కాంగ్రెస్ నోట్స్" అన్న పేరు మీద భారతదేశంలో కాంగ్రెసు కారణంగా జరిగిన సంఘటనలన్నింటినీ వివరించేవారు. ఆ పద్ధతుల మీదే ఆంధ్రరత్న "చీరాల-పేరాల నోట్స్"ను ప్రారంభించాడు.

**బ్రాహ్మణత్వప్రదానం :**

ఆయన క్షుణ్ణంగా సంస్కృతం నేర్చినవాడూ, విద్యావేత్తా, పండితుడూ అవడం చేత హిందూ మత సద్ధర్మాలకూ, మూలసూత్రాలనూ బాగా ఎరిగి ఉన్నవాడు. బ్రాహ్మణ, బ్రాహ్మణేతర సామరస్యం చెడి, వారి మధ్య రాజుకుని ప్రజ్వరిల్లుతున్న భేద భావాభావాలనీ, వారి మధ్యనున్న అగాధాన్నీ అంతమొందించడానికి సులభోపాయంగా, బ్రాహ్మణేతరులందరిచేత యజ్ఞోపవీత ధారణ చేయించి, వారినీ బ్రాహ్మణులుగానూ, వారితో సమానస్థాయిని అనుభవించే వారిగానూ మారుస్తాననీ, వారికందరికీ వలసిన బోధ చేసి బ్రాహ్మణత్వం ఇస్తాననీ ఒక క్రొత్త పథకాన్ని ప్రచారంలోనికి తీసుకువచ్చాడు. ఆయన కొంతకాలం కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా కూడా పనిచేశాడు. ఆ హోదాలో భారతదేశమంతటా తిరిగే రోజులలో క్షయరోగానికి గురి అయి, చాలా చిన్న వయస్సులోనే పరమపదించారు.

నీకు పరమాత్ముడిచ్చిన సర్వశక్తులూ ఆయన సృష్టిని ఆనందంతో సేవించడానికే ఉపయోగించు - అదీ నిస్వార్థంగా. జీవిత సౌందర్యమంతా దాని అంకిత భావంలోనే యిమిడి ఉంటుంది.

**- స్వామీ రామదాసు**





# మాతృసంస్థ కబుర్లు

జూలై నెల నాలుగవ తేదీ సాయంత్రం 5 గంటలకు పరమపూజ్య గురుదేవులు "శ్రీహనుమచ్ఛక్తి జాగరణ సమితి" ఆధ్వర్యంలో జరిగిన సాధుసంతుల తోడి సమావేశానికి ప్రధాన అతిథులుగా వెళ్లారు. వారు తమ ఆశీర్వాద ప్రస్తావనలో రామాలయం విషయమై గతంలో జరిగిన విశేషాలన్నిటినీ రేఖామాత్రంగా స్పృశించారు. ఏ కార్య సాఫల్యానికైనా దృఢసంకల్పం, ప్రణాళికాబద్ధమైన నిర్వహణ విధానం ఉన్నపుడే సత్ఫలితం వస్తుందనీ, అనాదిగా జాతికి సంక్రమించిన అవమానకర కళంకాన్ని తొలగించుకోవలసిన బాధ్యత భారతీయులందరిదీననీ స్పష్టం చేశారు. అనైక్యత, అలక్ష్యం వంటి అవలక్షణాలు మననెలా పట్టిపీడిస్తున్నాయో చరిత్ర తడిమి చెప్పారు. ఇప్పటికైనా దీక్షా కంకణబద్ధులమై మసక బారిన మన ప్రాచీన వైభవాన్ని శ్రీరామమందిర నిర్మాణంతో పునర్దీప్తిమంతం చేయాలని ఉత్తేజపరిచారు. అటుపై మాతాశ్రీ నిర్మలయోగ భారతిగారు ఆవేదన, ఆవేశాలతో ప్రసంగించి శ్రోతల మనస్సులలో జాగృతి దీపికలను వెలిగించారు. సమావేశం చివర శ్రీరామ నామ జపం, సామూహిక హనుమాన్ చాలీసా పఠనం తీర్మానింపబడ్డాయి.

జూలై ... నాడు శ్రీ సిహెచ్.వి. సుబ్బారావు, శ్రీమతి శ్రీవల్లి దంపతులు వారి కుటుంబ, వ్యక్తిగత సమస్యల నివృత్తికై సాయిధామాన్ని విడిచివెడుతున్న సందర్భంగా వీడ్కోలు ఏర్పాటు చేయబడింది. శ్రీ సుబ్బారావు దంపతులు పన్నెండు సంవత్సరాలుగా ఆశ్రమంలోని శ్రీ సాయి విద్యాధామం పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. సుబ్బారావు కార్యకర్తగా కూడా రూపొంది ఆశ్రమానికి చెందిన అనేక కార్యక్రమాలలో చురుకుగా చొరవతో పాల్గొన్నారు. గురుదేవులకు తోడుగా బయటి కార్యక్రమాలకు కూడా వెడుతుండేవారు. నిజాయితీ గల కార్యకర్తగా పనిచేసిన సుబ్బారావును వదులుకోవటం ఆశ్రమానికి ఇష్టం లేకపోయినప్పటికీ, అతని పరిస్థితులను బట్టి అతని కోరికకు అంగీకరించక తప్పలేదు. వదలవలసి వచ్చిన గురుదేవులకు కూడా బాధ కలిగింది. శ్రీవల్లీ, సుబ్బారావుతోపాటు మాతాజీ కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. కానీ,

కాలం చిత్రమైంది. బాబావారు ఎప్పుడు ఎవరిని ఎక్కడ ఉంచుతారో మన వంటి సామాన్యులకు అర్థమయ్యే విషయం కాదు. అంచేత వాళ్ల సమస్యలు తీరగానే మళ్లీ రమ్మని చెప్తూ ఆశీర్వదించి సత్కరించి పంపించింది ఆశ్రమం సుబ్బారావుగారిని, అతని కుటుంబాన్నీ.

జూలై 14వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఆశ్రమ పరిసరాలలోని 12 గ్రామాలలో శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణ నడిచింది. కీసరలో ప్రభాకరరెడ్డి, అంకిరెడ్డిపల్లెలో సరస్వతి, బొమ్మలరామవరంలో జ్యోతి, నాగమణి, హాజీపురంలో సిద్ధిరాజు, రాధిక, ధర్మారెడ్డిగూడెంలో శ్రీ కె.చంద్రారెడ్డిగారు, పర్వతాపురంలో శ్రీ ఆనందంగారు మల్యాలలో జహంగీరు ఆధ్వర్యం వహించి చక్కగా సప్తాహం నిర్వహించారు. రామలింగంపల్లెలో చి॥ దీపిక ఇచ్చిన సహకారంతో పెద్దలు, పిన్నలు ఉత్సాహంగా కార్యక్రమం పూర్తిచేశారు. ప్రతి గ్రామంలోనూ సాయి విద్యాధామం విద్యార్థులు, పూర్వ (పాత) విద్యార్థులు కూడా చేసిన కృషి ఎనలేనిది. ముఖ్యంగా ఖాజీపేట, తూముకుంట గ్రామాలలో మా పిల్లలు ఎంతో ఉత్సాహంగా వాళ్లే దీపాలు, పటాలు, ప్రసాదాలు వంటి ఏర్పాట్లన్నీ చేసుకొని, పెద్దలను కూడా సమీకరించుకొని నడిపిన తీరు సంతోషాన్ని కలిగించింది. అన్నిచోట్లా చివరి రోజున చిన్న ఊరేగింపు ఎదురైన వారికి ప్రసాదవినిమయం కూడా జరిగినవి.

జూలై 21వ తేదీ నుండి ద్వారవతిలో ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణ జరిగిన వెంటనే ఉద్దమర్రి భక్తులు సాయినామ ఏకాహం ప్రారంభించారు. బొమ్మల రామవరం, అంకిరెడ్డిపల్లె, చీర్యాల, మల్యాల, హాజీపురం, నాగారం (సత్యనారాయణ పురం కాలనీ), తెనాలి మొదలైన గ్రామాల నుండి వచ్చిన భక్తులు, మధ్య మధ్య సాయిధామం బాలలు, వృద్ధులు మరునాటి ఉదయం ఆరుగంటల వరకు అఖండంగా సాయినామం కీర్తించారు. ఆపివేసిన తర్వాత కూడా "ఓం సాయిరాం శ్రీ సాయిరాం జయ జయ సాయిరాం జయ సాయిరాం" కొన్ని గంటల పాటు చెవిలో ధ్వనిస్తూనే ఉన్నది.

22వ తేదీ గురువారం ఏకాదశి. ఆనాడు సామూహిక సాయినాథవ్రతం జరిగింది. ఆ రోజే 'శ్రీ హనుమత్ శక్తి జాగరణ సమితి' తరపున అయోధ్య రామాలయ నిర్మాణ సంకల్పంతో హనుమాన్ చాలీసా పారాయణ శ్రీ కె.నారాయణరావుగారి (విశ్వ హిందూ





పరిషత్) ద్వారా జరిగింది. మరునాడు 23వ తేదీ శుక్రవారం. సాయికృష్ణునికి విష్ణుక్రాంతలు, శంఖు పుష్పాలు, నీలాంబరాలు మొదలైన పూలతో అర్చన జరిగింది. అటుపైన 9 గంటలకు భగవద్గీతా పఠనం ప్రారంభం. శ్రీయుతులు శివప్రసాద్, నరసింహారెడ్డి, గోవర్ధన్, శ్రీమతులు ప్రభావతి, పద్మావతి, సంపూర్ణ, దుర్గామల్లీశ్వరి, సులోచన, ప్రశాంతి వాసులు, మాతాజీ మరికొందరు భక్తులు దిగ్విజయంగా పారాయణ నిర్వహించారు. 24వ తేదీ ఉదయం నుండి శ్రీ లక్ష్మణరావుగారు తమ వృద్ధాప్యాన్నీ అనారోగ్యాన్నీ కూడా లెక్క చేయకుండా దత్తమందిరంలో మా పరమపూజ్య గురువులు శ్రీశ్రీశ్రీ మాణిక్యరాయశర్మ మహారాజుల పేరిట శిలాఫలకం పెట్టించే పనిలోనూ, తదితర కార్యక్రమాలలోనూ తలమునకలు కాసాగారు. అంతలో దానితోపాటే ద్వారవతిలో విష్ణుసహస్రనామ పారాయణ ప్రారంభమైంది. మళ్లీ మా బృందమంతా ఈ పారాయణలో పాల్గొన్నది. అంతలో వచ్చిపడ్డారు సాయి విద్యాధామం బాలబాలికలు. వారితోసహా సాయిచాలీసా పారాయణ ప్రారంభమైంది. 108 ఆవర్తాలు పూర్తి అయ్యాక బాలల బాబా చరిత్రను పారాయణం చేసారు పిల్లలు. సాయి మారుతికి (శనివారం) తమలపాకులతో ముచ్చటగా అర్చన చేసాడు సుబ్రహ్మణ్యం. ఆ రోజు బడిపిల్లలందరికీ 400 లడ్లు, తిన్నంత పులిహోర ప్రసాదంగా పంపించారు శ్రీ అరవిందాక్షన్ నాయర్‌గారు, శ్రీమతి తంగమణి. ఆ రాత్రికి దూరాలలో ఉండే భక్తులు కొందరు వచ్చేసారు. శ్రీ ఎం.కె. రఘుగారి ద్వారా పూలు కూడా (లక్ష పుష్పార్చనకు) వచ్చేసాయి. చైత్ర, సుధీర పనుల్లో ఉన్న వాళ్ల కాళ్లకు అడ్డం పడుతూ హడావిడిగా పిల్లులతోపాటు తిరుగుతున్నారు.

సాయంత్రం నుండీ ఎడతెగని వాన. రేపు కూడా వాన ఇలానే ఉంటే జనం ఏం వస్తారో, ఎలా వస్తారో! వంట ఎంతమందికి చేయించాలి? వాన కురుస్తుంటే వడ్డన ఎలా చెయ్యాలి? ఇంతా చేసి గ్రామాల నుండి ఎవరూ రాకపోతే సౌందర్యమేముంది! రకరకాల ఆలోచనలు అందరిలో. అంతలో కాకినాడ నుంచీ ఫోను. గౌరీకుమారి అంటోంది- "ఏం మాతాజీ! మీరు బాబా గారితో యింకా దెబ్బలాడలేదా? వాన తెగ కురుస్తోందిక్కడ. ఎలాగో రైలెక్కేసాము. అక్కడెలా ఉంది?" అంటూ. ప్రాణం తెరిపిన పడింది. బాబా పటం ఎదురుగా నిలబడి "ఏమయ్యా వాన ఆపి జనాన్ని రానిస్తే సరే

- లేకపోతే ఆ గుళ్లో అలా కునుకుతూ ఒక్కడివే కూర్చో - నీ యిష్టం” అని ముసలాయనకు అల్టిమేటం యిచ్చేసి ముసుగుతన్ని పడుకున్నాము. ఆ వాన తెల్లవార్లు అలా కురుస్తూనే ఉంది. తెల్లవారింది. గుడిలో ప్రభాతసేవ పూర్తయింది. వాన ఆగిపోయింది. అందరికీ ఆనందం. చకచక పనులు సాగిపోతున్నాయి.

శ్రీ సాయీ క్షీరాభిషేకానికి మా కపిల, నందిని, శబల గోమాతలు ఇచ్చిన క్షీరం వెళ్లగా శ్రీ లక్ష్మణరావుగారు, చంద్రారెడ్డి క్షీరాభిషేకం చేసారు. జలాభిషేకానికి కీసర, రామలింగంపల్లె, హాజీపురం, పర్వతాపురం, బొమ్మల రామవరం, ఉద్దమర్రి, చీర్యాల, తూముకుంట, అంకిరెడ్డిపల్లె గ్రామాల నుండి తెచ్చుకున్న ఆయా బావులలోని నీటితో గ్రామీణులు స్వామిని అభిషేకిస్తుండగా పూజారి సుబ్రహ్మణ్యంగారు నమక చమకాలు శ్రీ సూక్త పురుషసూక్తాలూ చెప్తూ ఎంతో నిండుదనాన్ని తెచ్చారు. స్వయంగా సాయినాధుల వారికి అభిషేకం చేస్తున్నందుకు గ్రామీణులంతా ఎంతో ఆనందించారు. పదింబావుకు అభిషేకం పూర్తయింది. లక్ష పుష్పార్చనకై సిటీ నుండీ భక్తులు తరలి వచ్చారు.

కొంచెం వెనక్కి వెడదాం. అప్పటికి నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉన్న గురువుగారు 24నే కాస్త కోలుకున్నారు. వారికి మాడున కాస్త నూనె పెట్టి పాదాలకు రాయటంతో మా గురుసేవ ముగించవలసి వచ్చింది. వారి అనుష్ఠానం, పూజ పూర్తి అయిన తరువాత కూడా అలసట కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఆశ్రమంలోనే ఉండమని కోరాము. సరిగ్గా పదిన్నరకు సహస్రనామాలతో పుష్పార్చన ప్రారంభమైంది. హాలు పొడవునా బారులు తీరి కూర్చున్నారు భక్తులు. పైన సిద్ధంగా ఉన్నారు పూజారులు. జాజులు, లిల్లీ పూలు, గులాబీలు, రకరకాల తెల్లని, ఎర్రని పుష్పాలు, పసుపు ముద్దల్లాగా బంతి పూలు, పారిజాతాలు, కనకాంబరాలు, రాసులు రాసులుగా వన్నెవన్నెలుగా పరిమళిస్తూ ........................ సంకల్పాదికాలన్నీ అయ్యాక సహస్ర నామాలు ప్రారంభించారు. హాలులో ఉన్న ప్రతివారూ ఓంకారం పలకాలన్నారు. హాలు ప్రతిధ్వనిస్తోంది ఓంకారంతో. ఒక్కొక్క పువ్వూ సాయి పాదాలపై ఉంచుతున్నారు భక్తులు. మూలవిరాట్టు శిరస్సుపైకి దోసిళ్లతో పూలు చల్లుతున్నారు పూజారులు. ఏ మట్టిలో పుట్టి ఎక్కడ విచ్చుకున్నాయో - ఆ పూలబాలలు. స్వామి శిరస్సుపైగా జారి, భుజాలు తాకి గుండెల మీదుగా ఒడిలోకి





చేరి, అటుపైన స్వామి పాదాలు తాకి, పరవశిస్తూ సోలిపోయి పీఠంపై రాలుతున్నాయి. జలజల అవి రాలుతున్న దృశ్యం అలా కళ్లల్లో బంధిస్తూ, ఓంకారంతో పెదవులతోనూ, ప్రేమతో కన్నులతోనూ అభిషేకిస్తున్నారు స్వామిని భక్తులంతా. ప్రతి వంద నామాల కొకసారి “ఓం సాయినాథ్ మహరాజుకూ జై” అంటున్నారు. అందరూ. అలా అలా సహస్రనామాలు పూర్తయ్యాయి. మహాహారతితో ఆ ఆనందానికి కామా పడింది. ఈ పూజ పూర్తయ్యే సమయానికి గురుదేవులు ఆలయంలోకి వచ్చారు. ప్రశాంతి కమలమ్మగారు సమర్పించిన కుర్చీలో ఆశీనులయ్యారు.

గురుదేవుల ఎదుట పాదుకలుంచి, వాటిని అలంకరించి పూజించాడు రాంబాబు. గురుస్తుతి చదివారు సైనిక్‌పురి సత్సంగశాఖవారు. గురుదేవులు తమ ఆశీః ప్రవచనంలో మానవ జీవిత విలువలను గురించి వివరిస్తూ జన్మధన్యం చేసుకోవటానికి మార్గదర్శనం చేసారు. అటుపైన ప్రతి ఏటా జరుగుతున్నట్లే - యీ గురుపూర్ణిమకు కూడా ఒక క్రొత్త ఆవిష్కరణ ఆలయంలో జరిగింది. పధ్నాలుగేళ్లనాడు గురుపూర్ణిమనాడే ప్రారంభమైన సాయి దేవాలయం ద్వారవతి. నాటినుండీ నేటికీ ప్రతి సంవత్సరం ఏదో ఒక క్రొత్త గ్రంథం విడుదల చేయటమో, ఒక క్రొత్త సంప్రదాయం ప్రారంభమో ఏదో ఒకటి జరుగుతూ ఉంటుంది. ఈసారి దానికి అంకురార్పణ చేసింది కాకినాడ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో పనిచేస్తున్న శ్రీమతి గౌరీకుమారి. ఆమె తమంత తాముగా ముందుకు వచ్చి శ్రీసాయినాథుల వారి శయన విగ్రహం పంచలోహాలతో పోతపోయించి తీసుకువస్తున్నారు గురుపూర్ణిమ నాటికి-అని పదిరోజుల క్రితం తెలిసింది. “ముసలాయన వస్తే ఎక్కడ పడుకోబెట్టాలి? నులకమంచం వేస్తారా? మంచి ఉయ్యాల ఒకటి చేయించాలి” అని చెవిలో జోరీగలాగా మాతాజీ గోలపెడుతోంటే - గురువుగారు కొంచెం ఉదాసీనంగా ఉండిపోయారు - ‘భారతి’ ఆర్థిక భారం వలన. ఇక సాయిబాబా తన పావులు కదపటం మొదలుపెట్టారు. మరునాటి ఉదయం పోస్టులో రెండు చెక్కులు వచ్చాయి. శ్రీమతి జమున అనే బ్యాంకు ఉద్యోగిని తమ సోదరి, తాము కలిసి రు.23,500/- చెక్కుల ద్వారా పంపించారు. దాని మీద ఉన్న ఫోన్ నెంబరుకు రింగ్ చేసి ‘యీ డబ్బు దేనికి ఉపయోగించాలని మీ ఉద్దేశ్యం?’ అని అడిగితే - ‘ఎప్పుడో ఒకసారి మీ ఆశ్రమానికి వచ్చామండీ! మొన్న

ఎందుకో యిలా పంపాలనిపించింది. ఫలానా దానికి అనేదేమీ లేదు-మీ యిష్టం వచ్చినట్లుపయోగించండి అన్నారు. వెంటనే మా కార్పెంటర్ సాయిని పిలిపించాము. తన భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నప్పటికీ సాయి మాట తప్పకుండా ఉయ్యాల సకాలానికి తయారుచేసి తెచ్చాడు. పుట్టబోయే తన కొడుక్కి ఆశీస్సులడుగుతూ ఆ ఉయ్యాలలోకి చిన్నపరుపు తానే కొనుక్కు వచ్చాడు. తెనాలి మల్లీశ్వరిగారు సులోచన సాయంతో అందమైన కుచ్చుల దిండు కుట్టారు. ప్రశాంతి వారు దండలు గుచ్చి కట్టి అలంకారం చేశారు. క్షీరాభిషేకం చేసుకొన్న శ్రీ సాయినాధుల వారి విగ్రహాన్ని ఉయ్యాలలో శయనింపజేసింది గౌరి. భక్తులంతా ఆనందంతో ఆ డోలోత్సవాన్ని తిలకించారు. విగ్రహం సిరులు చిందుతున్నదని ఎంతో ముచ్చట పడ్డారు.

అటుపైన భక్తులంతా గురుదేవులకు నమస్కారాలు చేసుకొని ఆశీస్సులు తీసుకున్నారు. మహాహారతి తరువాత భోజనాల కోసం అన్నపూర్ణకు తరలి వెళ్లారు అందరూ. ఈసారి వంటల బాధ్యత తీసుకున్న శ్రీ నాయర్‌గారు (భవానీ ఇంజనీర్స్) ఉదయం ఏడు గంటల నుండీ ఆఖరి భక్తుడు భోజనం చేసి వెళ్లే వరకూ అన్నిటా తామై నిలబడి చాలా సమర్థవంతంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించి, గురుదేవుల ఆశీస్సులు అందుకున్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి అవసరమైన కొన్ని పాత్రలు, కుర్చీలు, బల్లలు, నీళ్లడ్రమ్ములు వగైరాలన్నీ అందించటమేగాక - తాను టెంట్‌హౌస్ నడిపినంతకాలమూ గురుపూర్ణిమకు ఉచితంగా సామగ్రి అందిస్తుంటానని వాగ్దానం చేసిన మణికంఠ టెంట్‌హౌస్ (బొమ్మల రామవరం) యజమాని శ్రీ రాంపల్లి భాస్కర్‌కు శ్రీసాయిరక్ష. ఉత్సవాలన్నీ రోజులూ తోరణాలు కట్టటం దగ్గరి నుండీ ప్రతి పనినీ బాధ్యతతో నిర్వహించిన మా సాయివిద్యాధామం ఉపాధ్యాయులు (ఆశ్రమ వాసులు), చి॥ వెంకటయ్య, చి॥ ప్రభాకర్‌లకు శ్రీ సాయి ఆశీస్సులు. గ్రామగ్రామానా సత్సంగాలకు సహకరించిన వారికీ, ఉత్సవంలో పాల్గొని సాయిదర్శనం చేసుకున్నవారికీ ఎలాగూ సాయి ఆశీస్సులు దొరకనే దొరికాయి.

అందరినీ మించి యీ ఉత్సవంలో అభినందించవలసిన వారొకరున్నారు. సరిగ్గా సమయానికి వాన ఆపి - అదీ ఒక్క అరకిలోమీటరు కైవారంలో మాత్రమే గొడుగు పట్టినట్లుగా ఆపి, (ఆరోజు సికింద్రాబాదు వరకూ ఎడతెగని వానే!) తన వారంతా తనను చేరుకోవటానికి అవకాశం కల్పించి, తన ఉత్సవం తాను విజయవంతం చేసుకున్న శ్రీ సాయినాథుల వారికి విశేషాభినందనలు.

☼







# ఇల్లా రారండీ!

బుల్లీ బుల్లీ పిల్లల్లారా యిల్లా రారండీ !
మీ తల్లిదండ్రులనెల్ల మీరూ పిలుచుకు రండీ !
జాతికంత పండగంట
ఆనందాల సందడంట - రండీ రండీ రారండీ ................................ ॥ బు ॥

అంతెత్తున ఎగిరే మన జెండా
అదిగదిగో ఆకాశం నిండా
తనవన్నెలు హరివిల్లై నిండా
ఆ నీడను మన కలలన్నీ పండా। రండీ రండీ రారండీ ॥ బు ॥

పైనున్నది కాషాయం - త్యాగానికి అది చిహ్నం
మధ్యలోని తెలివర్ణం - శాంతానికి ప్రతి రూపం
దిగువనున్నదే హరితం - పాడిపంటల సంకేతం - రండీ రండీ రారండీ ॥ బు ॥

నడుమ నిలచె ధర్మచక్రం - తరతరాల కీర్తి చక్రం
శాంత్య హింసల ప్రతిబింబం - ఇతిహాసపు కాంతి చక్రం
దేశ ప్రగతికి అది చిహ్నం - నిరంతర భ్రమణ శీలం - రండీ రండీ రారండీ!

బుల్లీ బుల్లీ పిల్లల్లారా యిల్లా రారండీ
మీ తల్లిదండ్రులనెల్ల మీరూ పిలుచుకు రండీ
జాతికంత పండగంట
ఆనందాల సందడంట - రండీ రండీ రారండీ ॥

భరతమాతకిదే ప్రణవాంజలీ (ఓం ........ ఓం .............. ఓం)
స్వతంత్రలక్ష్మికిదె స్వాగతాంజలీ (శంఖధ్వని)
జయపతాక కిదే పుష్పాంజలీ (పుష్పాభిషేకం)
భాగ్యవిధాతకిదె వినయాంజలీ ! (2) వీరాసనంలో నమస్కారం

***(2010-ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవపు సంబరాలలో శ్రీ సాయి విద్యాధామం ఆలపించిన నవగీతం)***

**రచన : సుమలత**